సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 5 । ఆగస్టు । 2024



7,307 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి ఆదివారానికి 7,307 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. జలాశయం 11.130 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.72,160
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,480
3 శాతం జీఎస్టీతో	రూ.6,674
నవర (8గ్రా)	రూ.53,392

గరిష్ఠం/కనిష్ఠం
38.7 /29.0

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. చిరు జల్లులు పడే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 49 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నెల్లూరు క్లబ్‌లో ఎన్నికల సందడి

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- 18 నామినేషన్లు దాఖలు
- అన్ని నామినేషన్లు ఆమోదం
- నేడు విత్‌డ్రాకు అవకాశం
- ఈ నెల 15న ఎన్నికలు



నెల్లూరు క్లబ్ ప్రధాన ద్వారం

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని ప్రముఖ క్లబ్‌ల్లో నెల్లూరు క్లబ్ ఒకటి. నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో బారాషహీద్ దర్గా సమీపంలో ఉన్న ఈ క్లబ్‌ను 1885లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం స్థాపించింది. ప్రతిష్టాత్మకమైన నెల్లూరు క్లబ్‌కు ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీంతో నెల్లూరు క్లబ్‌లో ఎన్నికల కోలాహలం నెలకొంది. ఎన్నికలు సైతం ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మొత్తం 18 నామినేషన్లు దాఖలయ్యా యి. ఎన్నికల అధికారి వసంతకుమార్‌రెడ్డి పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నట్లు ఆమోదం తెలిపారు. ఈదఫా నెల్లూరు క్లబ్ పాలక వర్గ అధ్యక్ష స్థానానికి కొండేటి శివప్రసాద్‌రెడ్డి, ఇసనాక సునీల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వీరేపల్లి అశోక్, దువ్వూరు వెంకటేష్‌రెడ్డి, సెక్రటరీగా పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, వితపు లలితారామ్, ట్రెజరర్‌గా ఆదూరు పూర్ణచంద్రరావు, పొక్కిరెడ్డి శ్రీహరిరెడ్డి పోటీపడుతున్నారు. ఇక ఏడు ఈసీ స్థానాలకు సంబంధించి మొత్తం 10 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో దుబ్బిశెట్టి శోభన్‌బాబు, కంది విజయభాస్కర్‌రెడ్డి, పాముల రమణయ్య, జెట్టి సురేష్‌రెడ్డి, షేక్ బాబు, కిలారి దినేష్, కర్నాటి బ్రహ్మారెడ్డి, కొప్పాల లీలామోహన్‌రెడ్డి, కారంశెట్టి ప్రవీణ్ కుమార్, ఉప్పు గిరీష్ ఉన్నారు. క్లబ్‌లో మొత్తం 1,960 ఓట్లు వరకు ఉన్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలు, బడా పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, డాక్టర్లు, ఉద్యోగులు ఈ క్లబ్‌లో సభ్యులుగా ఉన్నారు. ప్రధానంగా ఆర్థికంగా అత్యంత సంపన్నమైన రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి ఎక్కువ ఓట్లు ఉన్నాయి. అయితే సోమవారం విత్‌డ్రా ప్రక్రియ ఉంటుంది. ప్రధాన రాజకీయ పక్షాలు ఎవరికి మద్దతు పలుకుతాయో వేచి చూడాలి. ఈ నెల 15న ఎన్నికలు నిర్వహించనున్నారు.

హోరాహోరీగా సాగిన బీచ్ కబడ్డీ పోటీలు

- పురుషుల విభాగంలో రాష్ట్ర స్థాయి విజేత ప్రకాశం



రాష్ట్ర స్థాయి విజేత ప్రకాశం

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 11వ ఆంధ్రా రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో భాగంగా ఆదివారం పురుషుల విభాగంలో ప్రకాశం జిల్లా విజేతగా నిలవగా, నెల్లూరు రన్నరప్‌గా నిలిచింది. రెండు రోజులుగా పముజుల శ్రీనివాసులు, మహాలక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. మహిళల విభాగంలో విజయనగరం విజేత కాగా, కృష్ణా జిల్లా రన్నరప్‌గా నిలిచింది. కార్యక్రమంలో నిర్వాహకులు పమజుల రవి ,దాసరి విజయకుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, డీఎస్‌డీఓ యతిరాజు, ఒలంపిక్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా: ఎంపీ వేమిరెడ్డి

క్రీడాకారులు వారి అభివృద్ధి కోసం తనతో పాటు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్ని వేళలా కృషి చేస్తామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇందుకురుపేటలో జరుగుతున్న బీచ్ కబడ్డీ పోటీల విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులను అందజేశారు.

స్పోర్ట్స్ సెలక్షన్ ట్రయిల్స్ నేడు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీ ట్రాన్స్‌కో ఉత్తర్వుల మేరకు 2024–25 సంవత్సరానికి ఇంటర్ సర్కిల్ పరిధిలో నిర్వహించే చెస్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొనే విద్యుత్ ఉద్యోగులు సోమవారం విద్యుత్ భవన్‌లో జరిగే సెలక్షన్ ట్రయిల్స్‌కు హాజరుకావాలని ఏపీఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ ఆర్.వేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపికైన వారు ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలోని గాజువాకలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

శంకరనగరంలో రాక్షస రాజ్యం

పరాకాష్టకు చేరిన పచ్చ ముష్కరుల రెడ్‌బుక్ దాష్టీకాలు

అధికార మదంతో టీడీపీ రాక్షస మూక సాగిస్తున్న అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ప్రత్యర్థుల ఇళ్లల్లోకి దూరి విధ్వంసాలు చేయడమే కాకుండా బాధితులపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేయించి జైలు పాల్జేశారు. అణువణువున క్రూరత్వం పులుముకున్న పచ్చ మంద కుట్రలు, కుతంత్రాలు, కల్మషం తెలియని బాలలపై తప్పుడు కేసులు బనాయించి పైశాచికానందంతో పేట్రేగిపోతోంది. ఊర్లో కనిపిస్తే చంపేస్తామంటూ చేస్తున్న హెచ్చరికలకు భయపడి అనేక కుటుంబాలు కట్టుకున్న ఇళ్లను, ముక్కారు పంటలు పండే భూములను బీళ్లుగా వదిలేసి కట్టుబట్టలతో ఊరొదిలి వెళ్లిపోయారు.



- ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి టీడీపీ నేతల కవ్వింపు చర్యలు
- వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లల్లోకి దూరి విధ్వంసం
- తిరిగి వైఎస్సార్‌సీపీ నేతలు 18 మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు
- నెలన్నరకు పైగా జైల్లోనే మగ్గుతున్న బాధితులు
- ప్రాణభయంతో వణికిపోతున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు
- చదువుకునే పిల్లలపై అక్రమ కేసుల నేపథ్యంలో ఊరొదిలి వెళ్లిపోయిన ఓ కుటుంబం



శంకరనగరం గ్రామం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఓ వైపు గలగల పారే పెన్నమ్మ.. మరో వైపు పచ్చని పంటలతో స్వర్గ సీమను తలపించే శంకరనగరం. ప్రశాంతమైన ఆ పల్లెలో రెడ్‌బుక్ దాష్టీకాలు పరాకాష్టకు చేరాయి. రాక్షస రాజ్యంతో ఊరు జనం చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. రాజకీయ కక్షతో పచ్చ ముష్కరులు చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాలు, సానుభూతిపరులపై రాజకీయ కక్షలు, వేధింపులు, భౌతిక దాడుల నేపథ్యంలో ప్రాణభీతితో వణికిపోతున్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి స్థానిక టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాలను టార్గెట్ చేశారు. విజయోత్సవాల పేరుతో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల ముందు నానా హంగామా చేసి వారిని రెచ్చగొట్టేలా చేసి ఘర్షణకు దిగారు. కర్రలు, కత్తులతో ఇళ్లలోకి వెళ్లి విధ్వంసం సృష్టించి వారి కుటుంబ సభ్యులను తీవ్రంగా గాయపరిచారు. టీడీపీ నేతల దాడులతో రక్తమోడుతూ ఆస్పత్రుల పాలైన వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాలపై అక్రమ కేసులు బనాయించి ఆడ, మగ తేడా లేకుండా జైలు పాలు చేశారు. బెయిల్‌పై వచ్చాక కూడా టీడీపీ నేతల బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఓ కుటుంబం ప్రాణభయం, అక్రమ కేసులతో ఇల్లూ వాకిలి, పొలాలు వదిలేసి ఊరు వదిలి వెళ్లిపోయింది. మరి కొందరు అదే బాట పడుతున్నారు.

బెయిల్ రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

అన్యాయంగా జైలుపాలైన బాధితులు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. పోలీసులు వారికి బెయిల్ రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. వారు తిరిగి ఊర్లోకి వస్తే రాజకీయ కక్షలు చెలరేగుతాయంటూ పోలీసులు తప్పుడు కౌంటర్లు వేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులే అసమర్థత వ్యక్తం చేస్తున్నారు. ఎవరి వల్ల శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతుందో వారిని కట్టడి చేయాల్సిన ఖాకీలు టీడీపీ పాలేర్లుగా పనిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తిరిగొచ్చినా బెదిరింపులే..

అక్రమ కేసులతో జైలు పాలై బెయిల్‌పై వచ్చిన వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై స్థానిక టీడీపీ నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. మీరందరూ ఊరొదిలి వెళ్లిపొమ్మని హుకుం జారీ చేస్తున్నారు. జైలు జీవితం అనుభవించి వచ్చిన వారికి సహాయ నిరాకరణ జరిగేలా మిగిలిన కుటుంబాలను బెదిరిస్తునారు. వైఎస్సార్‌సీపీ నేతలకు సంబంధించిన కుటుంబాలు గ్రామంలో లేకుండా చేయాలనే లక్ష్యంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. బాధితుల కుటుంబాలకు చెందిన భూముల్లో పంటలు పండించునే పరిస్థితి లేదు. వారు గ్రామంలో స్వేచ్ఛగా తిరిగే అవకాశం లేదు. ఏ సమయంలో టీడీపీ మూకలు వచ్చి దాడులు చేస్తారేమోనని హడలిపోతున్నారు. ఇంకా ఎనిమిది మంది జైల్లోనే మగ్గుతున్నారు.



గ్రామం విడిచి వెళ్లిపోయిన నాగేంద్రరెడ్డి నివాస గృహం

ఇళ్లు.. పొలాలు వదిలేసి..

వ్యవసాయమే ఆధారమైన ఆ కుటుంబాలకు చెందిన భూములు సాగు చేయకుండా బోర్లు ధ్వంసం చేశారు. విద్యుత్ స్టార్టర్లను పీకిపారేశారు. విద్యుత్ లైన్లు కట్ చేయించారు. ఈ క్రమంలో శంకగనగరంలో వైఎస్సార్‌సీపీకి వీరాభిమానిగా ఉన్న ఆటో డ్రైవర్ నాగ నాగేంద్రరెడ్డి కుటుంబాన్ని టీడీపీ నేతలు టార్గెట్ చేశారు. అతని ఇద్దరు పిల్లలపై అక్రమ కేసులు నమోదు చేయించారు. గ్రామంలో ఘర్షణ జరిగిన సమయంలో అతని పెద్ద కుమారుడు సుమంత్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ అక్కడే ఉండడంతో అతని పేరు కేసు నుంచి తొలగించారు. మరో కుమారుడు సతీష్ స్థానికంగా ఉంటూ చదువుకుంటున్నాడు. అతనిపై అక్రమ కేసు బనాయించడంతో మైనర్ అయిన సతీష్‌ను తిరుపతిలోని హోంకు తరలించారు. తమ కుటుంబాన్ని టీడీపీ నేతలు టార్గెట్ చేసి చదువుకునే బిడ్డలపై కేసులు బనాయించడంతో వారు అక్కడ బతకలేమని ఆస్తులను తెగనమ్మి ఊరు వదిలి వెళ్లిపోయింది.

నా పిల్లలకు బెయిల్ ఇవ్వండి



రాజకీయ కక్షలతో శంకరనగరంలో మా కుటుంబాలు ఇల్లు, పొలాలు అమ్ముకుని గ్రామాన్ని విడిచి వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి. మా ఇళ్లపై దాడులు చేసి ఇంటి కిటికిలు, టీవీలు, అద్దాలు, బయట ఉన్న బైక్‌లను ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న నా ఇద్దరు కుమారులతో పాటు నా తమ్ముడు, ఆయన కొడుకును గొడ్డలితో దాడి చేసి తీవ్ర గాయాల పాల్జేశారు. మాపైనే దొంగ కేసులు బనాయించి దాదాపు 50 రోజుల నుంచి జైల్లో ఉంచడం చాలా బాధాకరం. ఇటీవల బెయిల్ వచ్చి రిలీజ్ అవుతున్నారనే సమయంలో ఇంకేదో కేసు పెట్టి బెయిల్ రద్దు చేయించారు. దీంతో మాకు 20 ఎకరాల మాగాణి బీడు భూమిగా మారింది. ఇటీవల నాకు ఆరోగ్యం బాగాలేకున్నా పట్టించుకునే నాథుడు లేక ఇంట్లో ఒక్కదాన్నే బిక్కుబిక్కుమంటూ గడిపాను. మా కుమారులతో పాటు ఉన్న మిగిలిన వారికి బెయిల్ ఇవ్వాలని కోరుతున్నాను.

– పార్లపల్లి జానకమ్మ

అదే బాటలో మరి కొందరు..

శంకరనగరంలో ఇంకా 8 మంది వైఎస్సార్‌సీపీ నేతలు వారి కుటుంబ సభ్యులు బెయిల్ రాక జైల్లోనే మగ్గుతున్నారు. ఒకవేళ వారు తిరిగొచ్చినా వారిపై అక్రమ కేసులు బనాయించేందుకు అధికార పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. పోలీసులు సైతం అధికార పార్టీ నేతల చెప్పు చేతల్లో ఉంటూ ఏకపక్షంగా అక్రమ కేసులు నమోదు చేయడంపై పోలీసుల పని తీరును స్థానిక ప్రజలు ఏవగించుకుంటున్నారు. మరికొందరిపై రౌడీషీట్లు ఓపెన్ చేయిస్తామని టీడీపీ నేతలు బహిరంగంగానే చెబుతుండడంతో కొందరు సైతం ప్రస్తుతం ఊర్లో లేకుండా పోయారు. మూడు పంటలు పండే పొలాలను వదిలేసి ఊరొదిలి వెళ్లిపోవడంతో దాదాపు 25 ఎకరాల బీడుగా మారిపోయింది.

వణికిపోతున్న ఊరు



బాధితుడు పార్లపల్లి రవి నివాసంలో బైక్‌లు..

రెండు నెలలుగా అధికార అహంకారంతో టీడీపీ నాయకుల అరాచకానికి శంకరగనగరం భయం గుప్పెట్లో బిక్కు బిక్కుమంటోంది. వైఎస్సార్‌సీపీ గ్రామ సర్పంచ్ వరలక్ష్మి కుటుంబంతో పాటు మరో పది కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. రెండు నెలలుగా ఇంటి గడప దాటేందుకు కూడా భీతిల్లుతున్నారు. టీడీపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారం రోజున గ్రామంలో కవ్వింపు చర్యలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ నేతలను దూషించడం, బెదిరింపులకు పాల్పడడం అది కాస్త తీవ్ర ఘర్షణగా మారింది. ఈ ఘటనలో 18 మందిపై టీడీపీ నేత రేషన్ షాపు డీలర్ వెంకటేశ్వర్లు తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి తప్పుడు కేసులు బనాయించారు. పోలీసులు కూడా విచారణ జరపకుండా ఏకపక్షంగా కేసులు నమోదు చేసి బాధితులనే జైలుకు పంపారు. వాస్తవానికి ఈ ఘటన జరిగిన రోజు ఐదుగురు మాత్రమే ఊర్లో ఉన్నారు. మిగతా వారందరూ ఎక్కడెక్కడో ఉంటే వారిపైనా కేసులు నమోదు చేశారు.

సోమిరెడ్డి ధనదాహానికి రైతులు బలి

- మాజీ మంత్రి కాకాణి మండిపాటు
- యాష్‌పాండ్ గండి పరిశీలన

ముత్తుకూరు: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధన దాహానికి రైతులు, దేవరదిబ్బ గిరిజనులు బలయ్యారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ఏపీజెన్‌కో యాష్‌పాండ్‌కు పడిన గండిని ఆదివారం కాకాణి పరిశీలించారు. బూడిద నీటితో నిండిపోయిన పంట పొలాలను సందర్శించారు. యాష్‌పాండ్‌కు గండి పడడానికి మీరే కారణమంటూ జెన్‌కో ఇంజినీర్లపై ఆగ్రహం వెలిబుచ్చారు. కాకాణి మాట్లాడుతూ యాష్‌పాండ్‌లో సిల్ట్ రిమూవల్ కాంట్రాక్ట్‌ను ఎన్నికల ముందు పిలిచారు. అవార్డు కూడా అయ్యింది. అయితే టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కాంట్రాక్టర్‌తో బేరసారాలు కుదరక పనులు జాప్యమయ్యాయి. చివరకు ఐదు రోజుల క్రితం పనులు చేపట్టడం వల్ల సిల్ట్ ఒత్తిడి పెరిగి యాష్‌పాండ్‌కు గండి పడిందన్నారు. 2019లో సోమిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు రూ.33 కోట్ల కాంట్రాక్ట్ పనులను రూ.56 కోట్లకు పెంచి, నాసిరకం పనులు చేయించాడని ఆరోపించారు. యాష్‌పాండ్‌కు పడిన గండి వల్ల సుమారు 100 ఎకరాల రొయ్యల గుంతలు, పంట పొలాల్లో బూడిద జలాలు ప్రవహించాయని, దీంతో ఆ భూములు ఎందుకు పనికి రాకుండా పోయాయన్నారు. నష్టపోయిన రైతులకు అండగా ఉండి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.



బూడిద నీరు చేరిన పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి

ఆర్అండ్ఆర్ కాలనీ దుస్థితికి సోమిరెడ్డే కారణం

నేలటూరు ఆర్అండ్ఆర్ కాలనీ పూర్తి కాకపోడానికి సోమిరెడ్డే కారణమని కాకాణి ధ్వజమెత్తారు. శిలాఫలకాలు వేయడం, డబ్బు దండుకోవడమే పనిగా పెట్టుకొన్నాడన్నారు. ప్రాజెక్ట్‌ల నుంచి రాబట్టాల్సిన నిధులు రాకపోవడం వల్ల కాలనీ పనులు నిలిచిపోయాయన్నారు. సోమిరెడ్డి ఏ రోజు కూడా ప్రాజెక్ట్‌ల యాజమాన్యాలతో చర్చించలేదన్నారు. రూ.118 కోట్లు మంజూరు చేశామని సోమిరెడ్డి చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఆయన వెంట పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, మునునూరువారిపాళెం సర్పంచ్ మునుకూరు జనార్దన్‌రెడ్డి, శీపారెడ్డి రామమోహన్ రెడ్డి, ఈపూరు కోటారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల శిలాఫలకాలు ధ్వంసం



కొండాపురం: మండలంలోని కొమ్మి పంచాయతీలో ఏర్పాటు చేసిన సచివాలయం, ఆయు ష్మాన్ భారత్, రైతు భరోసా కేంద్రాల గోడలకు ఏర్పాటు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మలు ఉన్న టైల్స్‌లను, శిలాఫలకాలను స్థానిక టీడీపీ నేతలు ముగ్గురు ఆదివారం సాయంత్రం ధ్వంసం చేశారు. ఆదివారం కావడం, సిబ్బంది లేకపోవడం చూసి టీడీపీ నాయకులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై పోలీసులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కొంత మంది గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు.

తవ్వుకో.. దోచుకో

- యార్డుల్లో నిల్వలు లూటీ చేశారు.. ఇప్పుడు రీచ్‌ల్లో దోచేస్తున్నారు
- విరువూరు రీచ్ నుంచి అర్ధరాత్రి వేళ అక్రమ రవాణా
- రోజూ 50 ట్రాక్టర్లతో తరలింపు
- సంగం బ్యారేజీకి పొంచి ఉన్న ముప్పు
- అడ్డుకున్న గ్రామస్తులపై దాడికి తెగబడిన వైనం
- సోమిరెడ్డి అండతో చెలరేగిపోతున్న 'పచ్చ' బకాసురులు

గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఐదేళ్లు సహజవనరులను అడ్డంగా దోచేశారు. అధికారం కోల్పోవడంతో ఇసుక దోపిడీకి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కళ్లెం వేయడంతో విలవిల్లాడిపోయారు. 'ఇసుక ఉచితంగా ఇస్తే.. నిర్మాణ రంగం ఊపందుకుంటుంది.. కూలీలకు పనులు దొరుకుతాయి.. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ పనిచేయలేదంటూ' చంద్రబాబు అండ్ గ్యాంగ్ చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. మళ్లీ అధికారం రావడంతో ఇసుక పాలసీ పెట్టకుండానే.. విచ్చలవిడిగా సహజ వనరులను దోచేస్తున్నారు. నిన్నటి వరకు యార్డుల్లో ఉన్న నిల్వలను లూటీ చేశారు.. అక్కడ ఖాళీ అయిపోవడంతో నేరుగా రీచ్‌ల్లోకి చొరబడ్డారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : జిల్లాలోని ఇసుక రీచ్‌లను పచ్చ మూకలు చెరబడుతున్నాయి. బ్యారేజీ మనుగడకే ప్రమాదమని తెలిసినా.. 'పచ్చ' బకాసురులు చెలరేగిపోతున్నారు. పర్యావరణ అనుమతుల్లేని రీచ్ నుంచి విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. రేపు అనే అవకాశం ఉంటుందో లేదో అన్నట్టుగా రేయింబవళ్లు పెన్నమ్మను కుళ్లబొడిచేస్తున్నారు. తవ్వుకో.. దోచుకో అనే రీతిలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఇసుకపై నోరెత్తి మాట్లాడడం లేదు. ఇసుక దోపిడీని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం వాటాల కోసం పాకులాడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిన్నటి వరకు డంపింగ్ యార్డుల్లో పడి ఇసుకను దోచేసిన పచ్చ మూకలు.. పర్యావరణ అనుమతులు లేని రీచ్‌ల్లో రాత్రి వేళల్లో ఇసుకను తోడేస్తున్నారు.

తాజాగా సర్వేపల్లి నియోజకవర్గంలోని స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అండతో ఆయన అనుచర వర్గం బరి తెగించి ఇసుక అక్రమ రవాణా సాగిస్తోంది. పొదలకూరు మండలం విరువూరు రీచ్‌లో వారం రోజులుగా రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి వేళ విరువూరులో ట్రాక్టర్ల రాకపోకల రణగొణ ధ్వనులతో గ్రామస్తులకు కంటి మీద కునుకు కరువైపోవడంతో ఆగ్రహించి రీచ్‌లో గురువారం రాత్రి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఒకనొక దశలో ఇసుక బందిపోట్లు స్థానికులపై దాడికి యత్నించారు. ట్రాక్టర్లకు అడ్డునిలిస్తే ట్రాక్టర్ చక్రాల కింద తొక్కిస్తామంటూ రెచ్చిపోయారు. గ్రామస్తులు మూకమ్మడిగా రావడంతో పరిస్థితి గమనించి ఈ బందిపోట్లు రీచ్ నుంచి ట్రక్కులు వదిలేసి పరారీ అయ్యారు.



పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రక్కులు

ఇద్దరిపై కేసు నమోదు

విరువూరుకు చెందిన బాలకృష్ణ, ధనుంజయలపై పొదలకూరు పోలీసుస్టేషన్లో అక్రమంగా ఇసుక తరలింపుపై కేసు నమోదు చేశారు. గ్రామస్తులు అడ్డుకుని ఇసుక ట్రక్కులను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించడంతో ఎస్సై రామకృష్ణ ఇసుక ట్రక్కులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

సంగం బ్యారేజీకి ముప్పందని..

విరువూరు ఇసుకరీచ్‌కు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ఇసుక రవాణా నిలిపివేశారు. ఆ గ్రామానికి సమీపంలోనే మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి ఉండడంతో ఆ ప్రాంతంలో ఇసుకను తోడితే ఆ ప్రాజెక్ట్ మనుగడకే ప్రమాదం జరిగే అవకాశం ఉందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. దీంతో గత ప్రభుత్వం ఆ రీచ్‌ను నిలిపివేసింది. ప్రభుత్వం మారడతోనే విరువూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ ఇసుక రీచ్‌పై కన్నేశారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతితో అనధికారికంగా వారం రోజులుగా రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంగం బ్యారేజ్‌కు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానిక రైతులు టీడీపీ నేతలకు చెబుతున్నా వారి పట్టించుకోలేదు. అక్రమార్జనే ధ్యేయంగా రాత్రి వేళల్లో రీచ్‌లో భారీ యంత్రాలు పెట్టి నిత్యం 50 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు రెవెన్యూ, మైనింగ్, పోలీస్, సెబ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. పర్యావరణానికి ముప్పు వాటిల్లి, భూగర్భ జలాలు అడుగంటిపోతాయని చెబుతున్నా ఎవరూ ఖాతరు చేయకపోవడంతో గ్రామస్తులు గురువారం రాత్రి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. శుక్రవారం ఉదయం పోలీసులు అక్కడికి చేరుకుని ఇసుక లోడ్ చేసిన ట్రక్కులను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

మహిళను అడ్డగించి..

• ఫోన్ చోరీ • ముగ్గురిపై కేసు

సంగం: ఓ మహిళను అడ్డగించి ఫోన్ లాక్కెళ్లిన కేసులో ముగ్గురు యువకులపై సంగం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. వెంగారెడ్డిపాళెం పడమటి దళితవాడకు చెందిన పంతగాని సుగుణ సంగం గురుకుల బాలికల గురుకుల కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. ఆమె నిత్యం స్కూటీపై వచ్చి విధులు నిర్వహించి ఇంటికెళ్లేది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం విధులు ముగిసిన తర్వాత వెళ్తుండగా ఎస్‌వీఆర్‌పురం వద్ద ఇద్దరు యువకులు ఆమెను ఆపి సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. సుగుణ ఇంటికెళ్లి వేరే ఫోన్ నుంచి తన ఫోన్ నంబర్‌కు కాల్ చేసింది. సంగం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్న కందల శివకృష్ణ అనే వ్యక్తి కాల్ రిసీవ్ చేసి మద్యం మత్తులో తనను తిట్టాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి శివకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించారు. అయినా అతను సదరు యువకుల పేర్లు చెప్పలేదు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. శివకృష్ణ గతంలో సైతం సుగుణ ఫోన్‌కు మేసేజ్‌లు పెట్టి వేధించినట్లుగా కేసు నమోదై ఉందని ఎస్సై నాగార్జునరెడ్డి వెల్లడించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	110
లేయర్ (లైవ్) :	90
బ్రాయిలర్ చికెన్ :	204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	230
లేయర్ చికెన్ :	153

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.70
సన్నవి :	రూ.50
పండ్లు :	రూ.40

2019కి ముందు పట్టణాలు, పల్లెల్లో దారుణ పరిస్థితులుండేవి. నాటి చంద్రబాబు పాలనలో ఊరూరా బెల్టు షాపులుండేవి. దాబాల్లో మద్యం ఏరులై పారేది. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ గెలుపొంది అధికారం చేపట్టాక తెలుగు తమ్ముళ్ల పుణ్యాన మళ్లీ ఆ కాలం వచ్చేసింది. ప్రభుత్వ మద్యం దుకాణాలను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లు తెచ్చి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.





దాబాలో మద్యం తాగేందుకు వచ్చిన వారు

బాబొచ్చాక.. ఊరూరా బెల్టు జోరు

• మద్యం దుకాణాలను గుప్పిట్లో పెట్టుకున్న తెలుగు తమ్ముళ్లు
• మినీబార్లుగా దాబాలు
• పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపులు
• యథేచ్ఛగా పొరుగు మద్యం విక్రయాలు
• మొక్కుబడి చర్యలకే అధికారుల పరిమితం

నెల్లూరు(క్రైమ్): తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. 2019కి ముందున్న పరిస్థితులు పునరావృతమయ్యాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత టీడీపీ నేతలు రెచ్చిపోయారు. ప్రభుత్వ మద్యం దుకాణాలపై పెత్తనం చెలాయిస్తున్నారు. వీరి కారణంగా దాబాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మళ్లీ గ్రామగ్రామన బెల్టు దుకాణాలు వెలుస్తున్నాయి. 2014 – 19 మధ్య జరిగింది చూస్తే నాటి టీడీపీ హయాంలో జిల్లాలో 338 మద్యం దుకాణాలు, 48 బార్లు ఉండేవి. బెల్టు దుకాణాలైతే మూడువేలకు పూమాటే. ఊరూవాడ మద్యం ఏరులై పారింది. 24 గంటలూ విక్రయాలు సాగేవి. శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం ఏర్పడింది.





నెల్లూరులోని దాబాలో ఇలా..

ఇష్టారాజ్యంగా..

జిల్లాలో సుమారు 400 వరకూ చిన్నా, పెద్ద దాబాలున్నాయి. 2024 ఎన్నికల ఫలితాల వరకూ ఇక్కడి పరిస్థితులు మామూలుగానే ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది. తెలుగుదేశం నేతల అండదండలతో చాలా ధాబాలు బెల్టు షాపులుగా మారిపోయాయి. మందు మీరు తెచ్చుకున్నా సరే.., లేకుంటే మా సిబ్బందే సమకూరుస్తారు అంటున్నారు. బహిరంగంగానే ఈ సౌకర్యం కల్పిస్తున్నారు. వందల దాబాలు ఇప్పుడు మినీబార్లుగా మారాయి. ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మందుబాబులతో దాబాలు కిక్కిరుస్తున్నాయి. నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలోని పలుచోట్ల 24 గంటటూ మద్య సేవనం జరుగుతోంది. మందుబాబులు తాగి నానాయాగీ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరంలో కూతవేటు దూరంలో ఎస్‌ఈబీ కార్యాలయాలున్నా నిర్వాహకులు యథేచ్ఛగా విక్రయాలు సాగించడం వెనుక అధికారపార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటమే కారణమని తెలుస్తోంది.

జిల్లాలో..

2014 - 19 మధ్య	ప్రభుత్వ మద్యం
దుకాణాలు : 338	దుకాణాలు : 193
బార్లు : 48	నేడు టీడీపీ ప్రభుత్వం వచ్చాక వెలిసిన బెల్టు షాపులు :
బెల్టుషాపులు : 3,000లకు పైగా..	సుమారు 600కు పైగా..

ప్రతి ఊరిలో..

కొత్త ప్రభుత్వంలో ప్రైవేట్ దుకాణాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే వాటిపై నియంత్రణ అధికారులకు తలకుమించిన భారం కానుంది. అధికార పార్టీ నేతలే వాటిని దక్కించుకుంటారు. కాగా నేడు షాపులు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. కొత్త పాలసీ వచ్చేలోగా కూటమి నేతలు ఊర్లలోని షాపులపై పెత్తనం చేస్తున్నారు. ఉద్యోగాలు తీసేయిస్తామని సిబ్బందిని భయపెట్టి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే, టీడీపీ ముఖ్య నేతల అండదండలతో తెలుగు తమ్ముళ్లు బెల్టు దుకాణాలను పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 600కు పైగా బెల్టు షాపులు పెట్టినట్లు అంచనా. కందుకూరు రూరల్, కావలి రూరల్, కొడవలూరు, కోవూరు, నెల్లూరు రూరల్, వెంకటాచలం, మనుబోలు, ఇందుకూరుపేట, మైపాడు, ఆత్మకూరు, రాపూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో బెల్టు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలను నిర్ణీత వేళల్లో మూసివేస్తుండడం, బార్లలో ఎమ్మార్పీ కంటే అదనంగా క్వార్టర్‌పై రూ.120, బీరుపై రూ.150 వసూలు చేస్తుండడం బెల్టు నిర్వాహకులకు కలిసొస్తోంది. వారు వివిధ మార్గాల ద్వారా మద్యం కొనుగోలు చేసి ఎమ్మార్పీపై రూ.40 అదనంగా వేసి మందుబాబులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నెల్లూరు నగరంలోనూ బెల్టు విక్రయాలు సాగుతున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

ఇలా జరుగుతున్నా..

టీడీపీ నేతల వల్ల జిల్లాలో పొరుగు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు కర్ణాటక, తమిళనాడు, గోవా, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి రోడ్డు, రైలు మార్గాన మద్యం బాటిళ్లు తీసుకొచ్చి విక్రయిస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. కఠినంగా వ్యవహరించాల్సిన ఎస్‌ఈబీ, పోలీసు అధికారులు నామమాత్రపు చర్యకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. ఇందుకు అక్రమార్కులు అధికార పార్టీ నేతల ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, వారితో కుదుర్చుకున్న లోపాయికారి ఒప్పందాలే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మాలకొండ స్వామీ.. పొట్ట కొట్టారయ్యా

• లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 29 మంది సిబ్బంది తొలగింపు
• వంశపారపర్యంగా అతి తక్కువ జీతంతో పనిచేస్తున్న వైనం
• టీడీపీ వారిని నియమించేందుకు యత్నం

వలేటివారిపాళెం: టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు తమ్ముళ్లు చిరుద్యోగులపై కక్ష గట్టారు. చాలాచోట్ల ఇప్పటికే రేషన్ డీలర్‌షిప్‌లు లాక్కున్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తెలుగుదేశం నేతలకు కావాల్సిన వారిని నియమిస్తున్నారు. దాదాపు ప్రతి ప్రభుత్వ శాఖలో చిన్న ఉద్యోగుల తొలగింపు జరుగుతోంది. తాజాగా మండలంలోని మాలకొండలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దశాబ్దాలుగా వంశపారపర్యంగా కులవృత్తులు చేస్తున్న, ఇతరులు 29 మందిని తొలగించేలా టీడీపీ నేతలు ఈఓపై ఒత్తిడి తెచ్చారు. నేడు వారంతా రోడ్డున పడ్డారు.

దశాబ్దాలుగా..

చాకలి, మంగళి, జంగం, కుమ్మర వర్గాలకు చెందిన వారికి 1952లో ఆలయంలో చిన్నపాటి ఉద్యోగాలిచ్చారు. తర్వాత వాటిని వంశపారపర్యంగా కొనసాగిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు తమ్ముళ్ల కన్ను ఈ ఉద్యోగులపై పడింది. తమవారిని పెట్టుకునేందుకు ప్రస్తుతం ఆయా విధుల్లో ఉన్న 29 మందిని తొలగించారు. పనికి రావొద్దని వారికి చెప్పేశారు. తరతరాలుగా దేవాలయాన్ని నమ్ముకుని ఉన్నామని, ఈ విధంగా చేయడం ఎంతవరకు సమంజసమని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

ఇక్కడ కూడా..

2014 నుంచి దేవస్థానం తరఫున భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. ఈ సేవ చేసేందుకు ఇతర మండలాల నుంచి ఎంతో మంది వస్తారు. తాజాగా దేవస్థానం గుర్తింపు కార్డు ఉంటేనే అన్నదానానికి రావాలని, లేకుంటే రావొద్దని టీడీపీ నాయకులు తేల్చిచెప్పారు. తమ పార్టీకి చెందిన వారే అన్నదానంలో పనిచేయాలని చెబుతున్నారు. వడ్డించేందుకు వచ్చిన తెలుగు తమ్ముళ్లు భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

ఇది అన్యాయం

ఈ వ్యవహారంపై గ్రామ సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు స్పందిస్తూ గతంలో వయస్సు ఎక్కువ ఉన్న వారినే తొలగించారని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎలాంటి కారణం లేకుండా ఇంతమందిని తొలగించడం అన్యాయమన్నారు. ఇలాంటి సంప్రదాయ మంచి పద్ధతి కాదని చెప్పారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావును వివరణ కోరగా సిబ్బందిని తొలగించడంలో తన ప్రమేయం లేదని, అంతకుమించి ఏం సమాధానం చెప్పలేనని మాట దాటేశారు.

అన్యాయంగా తొలగించారు



మా మామయ్య జొన్నవరపు చినమాలకొండయ్య 1960 నుంచి 1994 వరకు పనిచేశారు. ఆయన తర్వాత మా అత్తమ్మ కొన్నేళ్లపాటు పనిచేసింది. నేను 19 ఏళ్లుగా పనిచేస్తున్నాను. రూ.400ల జీతంతో మొదలు పెట్టాను. రూ.3,500 ఇస్తున్నారు. మూడు తరాలుగా దేవస్థానంలో సేవ చేసుకుంటున్న నన్ను అన్యాయంగా తొలగించారు. ఎమ్మెల్యే ఆదేశాలతోనే తొలగించారని ఈఓ చెబుతున్నారు. – జొన్నవరపు మాధవి

2014 నుంచి పనిలో ఉన్నా



50 ఏళ్ల క్రితం మా తాత మారుపాకల నరసింహం దేవస్థానం సిబ్బందికి అన్నం వండి పెట్టేవారు. ఆయన మరణానంతరం మా తండ్రి రామచంద్రయ్య అదే వృత్తిని 15 ఏళ్లపాటు కొనసాగించారు. 2014 నుంచి దేవాలయంలో వివిధ పనులు చేస్తున్నాను. రూ.3,500 జీతం ఇస్తున్నాను. మూడు తరాలుగా ఆలయంలో సేవలు చేసుకుని జీవిస్తుంటే అకస్మాత్తుగా తొలగించి కడుపు కొట్టారు. – మల్లికార్జునరావు

నీ సేవలు అవసరం లేదన్నారు



19 ఏళ్లుగా ఆలయంలో వివిధ పనులు చేస్తున్నాను. ఇప్పుడు రూ.3,500 జీతం ఇస్తున్నారు. ఇటీవల నీ సేవలు అవసరం లేదని బయటకు పంపించారు. రాజకీయ పరమైన ఒత్తిళ్లు ఉన్నాయని ఆలయ అధికారులు చెబుతున్నారు. నాకు పుట్టుకతోనే చెవుడు ఉంది. తొలగించడం ఎంత వరకు సబబు? – దేగా తిరుపతయ్య

యాష్‌పాండ్ ఘటనపై విచారణకు డిమాండ్

• ఎకరాకు రూ.3 లక్షల నష్టపరిహారమివ్వాలి
• సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ముత్తుకూరు మండలంలోని నేలటూరులో ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్ యాష్‌పాండ్‌కు శనివారం గండి పడిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. నెల్లూరు బాలాజీ నగర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్ట తెగిపోతుందని స్థానిక రైతులు హెచ్చరిస్తున్నా స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.3 లక్షలు, చేపల వేటపై ఆధార పడిన గిరిజన, దళిత కుటుంబాలకు రూ.10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాష్‌పాండ్ చుట్టుపక్కల నివాసం ఉన్నవారిని సురక్షిత గ్రామాలకు తరలించాలన్నారు. గాలికి చుట్టుపక్కల ప్రాంతాల్లో బూడిద పడుతుండడంతో స్థానికులు తినే ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయన్నారు. యాష్‌పాండ్‌ను దూరంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, ముత్తుకూరు మండల సీపీఎం కార్యదర్శి అంకయ్య, నాయకులు గోగుల శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో సేవలు మీ కోసమే..

ప్రతి వాహనదారుడు రెగ్యులర్‌గా పెట్రోలు బంక్‌కు వెళ్తానే ఉంటారు. చాలా మంది కిందకు దిగకుండానే పెట్రోలు, డీజిల్ పట్టించుకుని వెళ్లిపోవడం సర్వసాధారణంగా జరుగుతుంది. అతి తక్కువ మంది మాత్రమే బైక్ లేదా కారుకు గాలి పట్టించుకుంటుంటారు. అసలు బంకులో ఎలాంటి సౌకర్యాలుంటాయో చాలామందికి అవగాహన కూడా ఉండదు. కానీ అక్కడ అందే సేవలు ఎన్నో ఉన్నాయి.

• పెట్రోలు బంకుల్లో వసతులు ఉచితం
• మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం తప్పనిసరి



బైక్‌కు గాలి పడుతున్న సిబ్బంది



నెల్లూరులోని పెట్రోల్ బంకు

నెల్లూరు సిటీ: పెట్రోలు, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయి. రేట్లు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతుంది. ప్రతి లీటర్‌పై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుముతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వీటి గురించి చాలామందికి తెలియదు. తెలిసిన ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలున్నాయి. పెట్రోలు బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు అందించకపోతే ఫిర్యాదు చేయొచ్చు.

తాగునీరు ఏర్పాటు చేయాలి

జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన పెట్రోలు బంకులు 220 వరకు ఉన్నాయి. అక్కడ స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి. దీని కోసం బంక్ డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ కలిగి ఉండాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు.

మరుగుదొడ్లు తప్పనిసరి

స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల కోసం శుభ్రతతో కూడిన మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా నిర్వాహకులు వినియోగదారులను అనుమతించడం లేదనే ఆరోపణలున్నాయి. మరికొన్ని చోట్ల అసలు అవి ఎక్కడున్నాయో కనిపించని పరిస్థితి ఉంది. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయొచ్చు. లీటరు పెట్రోలు లేదా డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకు మరుగుదొడ్ల, నిర్వహణకు చెల్లిస్తున్నామనే విషయం మరిచిపోకూడదు.

అత్యవసరమైతే ఫోన్ వాడుకోవచ్చు

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోలు బంక్‌కు వెళ్లి ఏ నంబరుకైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోండి

పెట్రోలు, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. ఈ సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలి. పెట్రోలు, డీజిల్ తక్కువ పడుతున్నారని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను నిర్వాహకులు అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ను ప్రదర్శించాలి.

గాలి ఉచితం

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్స్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

ప్రథమ చికిత్స కిట్ ఉంచాలి

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్‌ను అందుబాటులో పెట్టాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్‌లో తప్పనిసరి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. గడువు తీరిన మందులు ఉంచకూడదు.

అవగాహన అవసరం



పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలపై చాలామంది వాహనదారులకు అవగాహన లేదు. కొందరు బంకు నిర్వాహకులు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. యజమానులు అందరికీ అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలి – రాపాల వాసు, నెల్లూరు

నిత్యం పరిశీలించాలి



పెట్రోల్ బంకులను సంబంధిత అధికారులు నిత్యం పరిశీలించాల్సి ఉంది. అప్పుడే వారు అవకతవకలకు పాల్పడరు. వాహనదారులకు ఉచిత సౌకర్యాలను కల్పిస్తారు. – అమర్‌నాథ్‌సింగ్, నెల్లూరు